క్లుప్తంగా

పోలీసులకు పరికరాలు



ఖానాపురం : రాష్ట్ర ప్రభుత్వం పోలీస్‌స్టేషన్లకు నూతన సాంకేతిక పరికరాలను అందజేసింది. స్థానిక పోలీస్‌స్టేషన్‌కు రెండు కంప్యూటర్లతోపాటు ప్రింటర్, రెండు సెల్‌ఫోన్లు, రెండు ట్యాబ్‌లు అందాయి. ఒక ట్యాబ్‌ను ప్రత్యేకంగా సైబర్ క్రైమ్ హాక్ కేసుల విచారణకు వినియోగించనున్నట్లు ఎస్సై రఘుపతి తెలిపారు. పాత సామగ్రిని జిల్లా కమిషనర్ కార్యాలయానికి తరలిస్తున్నట్లు పోలీస్ అధికారులు తెలిపారు.

పిచ్చిమొక్కల తొలగింపు



నల్లబెల్లి : మండలంలోని గుండ్లపహాడ్ నుంచి నాగరాజుపల్లి గ్రామాల మధ్య రోడ్డుకు ఇరువైపులా ప్రమాదకరంగా పెరిగిన పిచ్చిమొక్కలను స్థానిక యువకులు సోమవారం డోజర్‌తో తొలగించారు. యువత శ్రమదానం చేశారు. కార్యక్రమంలో స్థానిక యువకులు కడుదూరి అమరేందర్, తోట విజయ్, గోనె వెంకటేశ్, కడుదూరి వంశీ పాల్గొన్నారు.

నియామకం



సంగెం : జాతీయ మానవ హక్కుల కమిటీ మండల చైర్మన్‌గా మండలంలోని షాపూర్‌కు చెందిన పూజారి అనిల్ నియమితులయ్యారు. ఆయన్ను చైర్మన్‌గా నియమిస్తూ సంఘం జిల్లా చైర్మన్ గంగుల అశోక్ సోమవారం ఉత్తర్వులు అందజేశారు. ఈ సందర్భంగా అనిల్ మీడియాతో మాట్లాడారు. కమిటీ ఆధ్వర్యంలో మండలంలో మానవ హక్కుల పరిరక్షణకు పాటుపడతానని చెప్పారు. ఆ దిశగా మండల ప్రజలకు అవగాహన కల్పించి చైతన్యవంతం చేయనున్నట్లు తెలిపారు. పేదలకు చట్టపరమైన ప్రక్రియలో భాగంగా మానవ హక్కులకు భంగం కలుగకుండా కృషి చేస్తానని చెప్పారు.

గుండెపోటుతో డ్రైవర్ మృతి

నెక్కొండ : గుండెపోటుతో టిప్పర్ డ్రైవర్ మృతి చెందిన ఘటన మండలంలోని తోపనపల్లిలో సోమవారం చోటు చేసుకుంది. ఎస్సై మహేందర్ కథనం ప్రకారం... గ్రామంలో గ్రీన్ ఫీల్డ్ హైవే రోడ్డు నిర్మాణ పనులకు వచ్చిన జార్ఖండ్ రాష్ట్రంలోని పాలం జిల్లాకు చెందిన టిప్పర్ డ్రైవర్ బబ్లు రామ్ (45) అనారోగ్య సమస్యలతో సతమతమవుతున్నాడు. ఈ నేపథ్యంలో బబ్లు రామ్ నిద్రలోనే గుండెపోటుకు గురై మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నర్సంపేట ఏరియా ఆస్పత్రికి తరలించామని, జిన్నా శ్రీకర్‌రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

తల్లికి తలకొరివి పెట్టిన కూతురు



రాయపర్తి : తల్లికి కూతురు తలకొరివి పెట్టిన హృదయ విదారకమైన ఘటన మండల కేంద్రంలో సోమవారం చోటుచేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం... మండల కేంద్రంలోని కొత్త రాయపర్తికి చెందిన గారె వెంకన్న యమున దంపతులకు కుమారులు లేరు. ఒక కుమార్తె ఉంది. కాగా యమున అనారోగ్యంతో బాధపడుతూ పరిస్థితి విషమించి సోమవారం మృతి చెందగా కుమారులు లేకపోవడంతో ఆమె మృతదేహానికి కుమార్తె పూజ తలకొరివి పెట్టింది. గ్రామంలో విషాదం నెలకొంది.

పరామర్శ



రాయపర్తి : మూత్రపిండాల్లో రాళ్లు వచ్చి శస్త్ర చికిత్స చేయించుకుంటున్న సందర్భంగా ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు చిర్ర మల్లయ్యను కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఈదులకంటి రవీందర్‌రెడ్డి సోమవారం పరామర్శించారు. ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మార్కెట్ వైస్ చైర్మన్ సరికొండ కృష్ణారెడ్డి, నాయకులు భూక్య సమ్మయ్య, పెండ్లి మహేందర్‌రెడ్డి, ఉల్లెంగుల యాదగిరి, రెంటాల గోవర్ధన్‌రెడ్డి, ఉల్లెంగుల నర్సయ్య, గబ్బెట బాబు, బీరం వెంకట్‌రెడ్డి, చెవ్వ కాశీనాథం, ఐరెడ్డి ఎల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సంగెం : గవిచర్లలో ప్రత్యేక ప్రార్థన చేస్తున్న ముస్లింలు



నర్సంపేట : అలాయ్ బలాయ్ తీసుకుంటున్న ముస్లింలు



ఊరూరా రంజాన్ వేడుకలు

సాక్షి నెట్‌వర్క్ : జిల్లావ్యాప్తంగా ముస్లిం సోదరులు రంజాన్ వేడుకలను సోమవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. నర్సంపేట, వర్ధన్నపేట, నల్లబెల్లి, నెక్కొండ, దుగ్గొండి, గీసుకొండ, సంగెం, ఖానాపురం, చెన్నారావుపేట, పర్వతగిరి, రాయపర్తి, తదితర మండలాల్లోని ఈద్గాలు, మసీదుల్లో ప్రత్యేక ప్రార్థన చేశారు. మత పెద్దలు ఖురాన్‌లోని ప్రవచనాలు ఉపదేశించారు. పలువురు ముసింలు జకాత్ పేరిట పేదలకు దుస్తులు, డబ్బు, పాయసం పంచి పెట్టారు. చిన్నా, పెద్దా వయోభేదం లేకుండా ఒకరినొకరు ఆలింగనం చేసుకుంటూ రంజాన్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. పలు చోట్ల ప్రజాప్రతినిధులు, రాజకీయ పార్టీల నాయకులు, అధికారులు రంజాన్ వేడుకల్లో పాల్గొని ముస్లింలకు అభినందనలు తెలిపారు.



దుగ్గొండిలో..



వర్ధన్నపేటలో..



రాయపర్తిలో..



ఖానాపురం : బుధరావుపేటలో...



పర్వతగిరిలో..



గీసుకొండ : జాన్‌పాక ఈద్గాలో..



నల్లబెల్లిలో..

ఘనంగా సత్తెమ్మ జాతర



పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే నాగరాజు

పర్వతగిరి : మండలంలోని ఏనుగల్‌లో సత్తెమ జాతర సోమవారం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే నాగరాజు జాతరకు చేరుకుని అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. తొలుత ఎమ్మెల్యే నాగరాజును నిర్వాహకులు శాలువాతో సత్కరించి స్వాగతం పలికారు. అనంతరం సత్తెమ్మ జాతరలో కాంగ్రెస్ పార్టీ తరఫున ఏర్పాటు చేసిన ప్రభబండ్లను డప్పుచప్పుళ్లు, కోలాటాల నడుమ ఎమ్మెల్యే నాగరాజు ప్రారంభించారు. జాతరలో కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు బొంపెల్లి దేవేందర్‌రావు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జాటోతు శ్రీనివాస్, మహిళా విభాగం అధ్యక్షురాలు మాసాని సువర్ణ, ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు భానోతు భాస్కర్‌నాయక్, నాయకులు తౌర్రి పద్మ కుమార్ యాదవ్, బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు కర్నె రవీందర్, నాయకులు తౌర్రి లక్ష్మణ్, లింగమూర్తి, దేవేందర్, నాగరాజు, వాసుదేవ్, రవి, రజని, తదితరులు పాల్గొన్నారు.



ప్రభబండ్లను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నాగరాజు

త్రైత సిద్ధాంత ఉగాది క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే మాధవరెడ్డి, తదితరులు

నర్సంపేట : త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ముద్రించిన తెలుగు ఉగాది క్యాలెండర్ (త్రైతశకం-47)ను పట్టణంలోని తన క్యాంప్ కార్యాలయంలో స్థానిక ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి సోమవారం ఆవిష్కరించారు. త్రైత శకం తెలుగు క్యాలెండర్‌ను అందరికీ అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాధవరెడ్డి మాట్లాడారు. నెలలు అనుసరించేలా తెలుగు తిథులతో ఆంగ్ల తేదీలను పొందుపర్చి కాలసూచికను అందించడం అభినందనీయమని తెలిపారు. కార్యక్రమంలో త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక జిల్లా కమిటీ అధ్యక్షుడు ఓంప్రకాశ్, సభ్యులు కిరణ్ ఆచారి, రావణాచారి, విక్రమాచారి, పద్మ, అక్షయ, రోహిణి తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో శారీరక, మానసిక వికాసం

- బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి

దుగ్గొండి : క్రీడలతో శారీరక, మానసిక వికాసం కలుగుతుందని నర్సంపేట బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తోకల శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. మండలంలోని పొనకల్‌లో క్రీడాకారులకు సోమవారం ఆయన క్రికెట్ కిట్లు అందజేసి మాట్లాడారు. యువత ఆటపాటల్లో ఆసక్తి పెంచుకుని రాణించాలని సూచించారు. క్రీడలు ఐక్యతకు బాటలు వేస్తాయని చెప్పారు. యువత క్రీడల్లో సత్తా చాటి జాతి గర్వించే స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. సన్మార్గంలో పయణిస్తూ సమాజానికి దార్శనికులుగా నిలవాలని కోరారు. క్రీడాకారులను ప్రోత్సహించడంలో ముందుంటామని చెప్పారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు ఎర్రల్ల బాబు, వర్కింగ్ ప్రెసిడెంట్ ఒలిగె నర్సింగరావు, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కొత్తకొండ రవివర్మ, నాయకులు మట్ట రాజు, మాదాసి సాంబయ్య, భరత్‌రెడ్డి, డ్యాగం శివాజీ, నాగరాజు, బండారి ప్రకాశ్, మట్ట స్వామి, కొలుగూరి సుమంత్, ఇజ్జగిరి నరేశ్, భూక్య గోపి రంజిత్, తదితరులు పాల్గొన్నారు.



క్రీడాకారులతో మాట్లాడుతున్న శ్రీనివాస్‌రెడ్డి

ఆలయ ప్రతిష్ఠాపన మహోత్సవానికి ఆహ్వానం



ఎర్రబెల్లికి ఆహ్వాన పత్రిక అందజేస్తున్న బాధ్యులు

పర్వతగిరి : మండలంలోని వడ్లకొండ గ్రామంలోని రంగనాయకులస్వామి గుట్ట ప్రాంగణంలో నిర్మించిన శ్రీసీతారామచంద్రస్వామి ఆలయ ప్రతిష్ఠాపన మహోత్సవానికి హాజరు కావాలని కోరుతూ మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావుకు ఆలయ కమిటీ బాధ్యులు ఆమడగాని రాజు యాదవ్, మాజీ ఎంపీటీసీ అత్తి రేవతికుమార్ ఆధ్వర్యంలో సోమవారం ఆహ్వాన పత్రిక అందజేశారు. అనంతరం దయాకర్‌రావును శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా రాజు, రేవతి కుమార్ మాట్లాడారు. రేపు (బుధవారం) నుంచి 4వ తేదీ వరకు ప్రతిష్ఠాపన మహోత్సవాలు జరుగుతాయని తెలిపారు. అనంతరం దయాకర్‌రావు ఆలయానికి తన వంతుగా రూ.50 వేల 116 విరాళం అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు బోయినపల్లి స్వామిరావు, చందసాని సమ్మయ్య, కరిమిళ్ల దేవేందర్‌రావు, జుట్టుకొండ రమేశ్, జుట్టుకొండ రాజు, దాడి లింగయ్య, కరిమిళ్ల దుర్గారావు, జుట్టుకొండ చిన్న నర్సయ్య, బైరి ఎల్లయ్య, దాడి సదానందం, దాడి వినయ్, పొడిశెట్టి దేవేందర్, జుట్టుకొండ నాగయ్య, పంతంగి శంకర్, పోకల రాకేశ్, తదితరులు పాల్గొన్నారు.

పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



సంగెం : మండల కేంద్రంలోని రవిచంద్ర హైస్కూల్‌లో 2011-12 విద్యాసంవత్సరంలో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు సోమవారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. సుమారు 13 ఏళ్ల తర్వాత ఒకరినొకరు కలుసుకుని ఆనందడోలికల్లో తేలియాడారు. స్కూల్ ఆవరణలో తిరుగుతూ నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుని ఆనందం పంచుకున్నారు. తమకు విద్యాబోధన అందించిన ఉపాధ్యాయులైన విజయలక్ష్మి, గాయపు రాజు, కాసం క్రాంతికుమార్, విష్ణువర్ధన్, వీరస్వామి, మల్లయ్యలను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పూర్వవిద్యార్థులు అల్లం శంకర్, కుమారస్వామి, శ్రీకాంత్, తాటికొండ సౌమ్య, అఖిల్, సాయి తదితరులు పాల్గొన్నారు.

మూలమలుపులు.. ముళ్లపొదలు

- ఎదురొచ్చే వాహనాలు కనిపించక ప్రమాదాలు
- ఆర్ అండ్ బీ అధికారుల నిర్లక్ష్యం

సంగెం : అసలే మూలమలుపులు.. ఆపై ముళ్లపొదలు.. వెరసి రోడ్లు ప్రయాణికులకు ప్రాణసంకటంగా పరిణమించాయి. మండల కేంద్రం నుంచి తీగరాజుపల్లి వరకు ఉన్న ఆర్ అండ్ బీ రోడ్డుకు ముళ్లపొదలు, చెట్లకొమ్మలు రోడ్డుపైకి చొచ్చుకుని రావడంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనపడక ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. మూల మలుపులపై అప్రమత్తం చేయాల్సిన సూచిక బోర్డులు సైతం సరైన రీతిలో లేని దుస్థితి నెలకొంది. సూచిక బోర్డులు చెట్ల కొమ్మల మాటున ఉండడంతో అవి కనపడక తరచూ వాహనాలు ప్రమాదాల బారిన పడుతున్నాయి. సంగెం సబ్‌స్టేషన్ సమీపంలో ఈనెల 14న మూలమలుపు వద్ద ద్విచక్ర వాహనదారులను బొలేరో ఢీకొట్టగా ఒకరు మృతి చెందగా మరొకరు తీవ్ర గాయాల పాలయ్యారు. ప్రమాదాలు జరుగుతున్నా ఆర్ అండ్ బీ అధికారులు సమస్య పరిష్కార దిశగా చర్యలు చేపట్టడం లేదని ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. మూలమలుపుల వద్ద ముళ్లపొదలు, చెట్ల కొమ్మలు రోడ్డుపైకి చొచ్చుకుని వచ్చిన క్రమంలో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి రోడ్డుపైకి చొచ్చుకుని వచ్చిన పొదలు, చెట్ల కొమ్మలను తొలగించి ప్రమాదాల నివారణ చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.



సంగెం : తిమ్మాపూర్ దారిలో మలుపు వద్ద కనిపించని హెచ్చరిక బోర్డు

పొదలను తొలగించాలి

మూలమలుపుల వద్ద ముళ్లపొదలు, చెట్లకొమ్మలు రోడ్డుపైకి చొచ్చుకొచ్చి ప్రమాదకర పరిస్థితులకు దారి తీస్తున్నాయి. కొన్ని చోట్ల హెచ్చరిక బోర్డులున్నా కనిపించడం లేదు. కొన్ని చోట్ల నేలకూలాయి. దీంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. రోడ్ల వెంట ముళ్లపొదలను తొలగించాలి.

- గోపిరెడ్డి మహేందర్, గ్రామస్తుడు

తొలగింపజేస్తాం

ముళ్లపొదలను, చెట్ల కొమ్మలను తొలగిస్తాం. హెచ్చరిక బోర్డులు వాహనదారులకు ఉపయోగపడేలా ఉండే దిశగా చొరవ తీసుకుంటాం. పడిపోయిన చోట మళ్లీ ఏర్పాటు చేయిస్తాం. ప్రమాదాల నివారణకు కృషి చేస్తాం. మూలమలుపుల్లో వాహనదారులు జాగ్రత్తగా ప్రయాణిస్తూ ప్రమాదాల నివారణలో భాగస్వాములు కావాలి.

-యూసుఫొద్దీన్, ఏఈ, ఆర్ అండ్ బీ శాఖ

కొవ్వొత్తులతో ర్యాలీ

గీసుకొండ : ఏపీలో పాస్టర్ ప్రవీణ్‌కుమార్ అనుమానాస్పద మృతిపై విచారణ చేపట్టాలని కోరుతూ క్రైస్తవులు ఆదివారం రాత్రి మొగిలిచర్లలో, ధర్మారంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. తొలుత పాస్టర్ మృతి పట్ల సంతాపం తెలిపారు. కార్యక్రమంలో క్రైస్తవ మత పెద్దలు యేసుపాదం, జోసఫ్, ఇమ్మాన్యుయల్, రంజిత్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్



నర్సంపేట : పట్టణంలోని సర్వాపురంలో పేకాడుతున్న 11 మందిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఎస్సై రవికుమార్ కథనం ప్రకారం.. సర్వాపురంలో పేకాడున్నట్లు సమాచారం అందడంతో పోలీసులు దాడులు నిర్వహించారు. పేకాటడుతున్న వారి నుంచి రూ.8080 నగదుతోపాటు పేక ముక్కలు స్వాధీనం చేసుకున్నారు. కార్యక్రమంలో ఎస్సై అరుణ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

'సేవాలాల్ విగ్రహ ఏర్పాటును మానుకోవాలి'

కొత్తగూడ : ప్రభుత్వం నూతనంగా నిర్మించే ఆదివాసీ మ్యూజియంలో సేవాలాల్ విగ్రహ ఏర్పాటును మానుకోవాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ జిల్లా నాయకుడు సిద్దబోయిన భాస్కర్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో సోమవారం ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో నాయకులు పెండకట్ల సమ్మయ్య, నాగేశ్వర్‌రావు, లక్ష్మినర్సు, సారంగపాణి, రామస్వామి, సికిందర్ పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆశయ సాధనకు పాటుపడాలి

- టీపీసీసీ సభ్యుడు సొంటిరెడ్డి రంజిత్‌రెడ్డి

నెక్కొండ : యువత డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ ఆశయ సాధనకు పాటుపడాలని టీపీసీసీ సభ్యుడు సొంటిరెడ్డి రంజిత్‌రెడ్డి ఆకాంక్షించారు. మండలంలోని పెద్దకొర్పోలులో తలపెట్టిన అంబేడ్కర్ విగ్రహ ప్రతిష్ఠాపనకు సోమవారం ఆయన భూమి పూజ చేసి మాట్లాడారు. గ్రామానికి చెందిన పోరండ్ల ఏకాంబ్రం, రమేశ్ వారి తండ్రి జ్ఞాపకార్థం అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుకు ముందుకు రావడం అభినందనీయమని తెలిపారు. భారతదేశానికి రాజ్యాంగాన్ని అందించిన మహనీయుడైన అంబేడ్కర్ జీవిత చరిత్రను సమాజంలోని ప్రతిఒక్కరూ అధ్యయనం చేయాలని సూచించారు. దేశ ఉన్నతికి అంబేడ్కర్ చేసిన సేవలు మరువలేనివని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు బక్కి అశోక్, నర్సంపేట ఏజీపీ బండి శివకుమార్, కిసాన్ సెల్ మండల అధ్యక్షుడు గై లక్ష్మణ్, నాయకులు కర్ర చెన్నారెడ్డి, బొడ్డుపల్లి యాదగిరి, బాదావత్ భీమన్న, మెండె కుమారస్వామి, కోరె యాదగిరి, తదితరులు పాల్గొన్నారు.



భూమి పూజ చేస్తున్న రంజిత్‌రెడ్డి

సింగపూర్‌లో ఉగాది వేడుకలు



శివదుర్గ ఆలయంలో నిర్వహించిన ఉగాది వేడుకల్లో తెలుగు ప్రజలు

నల్లబెల్లి : తెలంగాణ కల్చరల్ సొసైటీ ఆఫ్ సింగపూర్ ఆధ్వర్యంలో ప్లొటోస్గ్ పాసిర్‌లోని శివదుర్గ ఆలయంలో విశ్వావసు నామ సంవత్సర ఉగాది వేడుకలు ఘనంగా నిర్వహించారు. తొలుత సొసైటీ సభ్యులు ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. పురోహితులు పేరి కృష్ణ శర్మ పంచాంగ శ్రవణం చేశారు. అనంతరం గంటల పంచాంగాన్ని పురోహితులు పంపిణీ చేశారు. సంప్రదాయ ఉగాది పచ్చడి, పులిహోర, ప్రసాదం అందజేశారు. సమన్వయ కర్తలుగా ప్రాంతీయ కార్యదర్శులు సంతోశ్ వర్మ, మాదారపు భాస్కర్, దుర్గా ప్రసాద్, జూలూరి సంతోశ్ కుమార్, బసికె ప్రశాంత్, బొడ్ల రోజ రమణి, విజాపూర్ రవికృష్ణ, అధ్యక్షుడు గడప రమేశ్‌బాబు, ఉపాధ్యక్షురాలు మిర్యాల సునీతరెడ్డి, ప్రధాన కార్యదర్శి బొందుగుల రాము, కోశాధికారి నంగునూరి వెంకటరమణ, సంస్థాగత కార్యదర్శి కాసర్ల శ్రీనివాస్‌రావు, కార్యవర్గ సభ్యులు పెరుకు శివరాం ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనులకు సహకరించాలి

దామెర : ఉపాధిహామీ పనుల్లో భాగంగా నూతన రోడ్ల నిర్మాణం కోసం రైతులు సహకరించాలని ఏపీఓ శారద అన్నారు. మండలంలోని సీతారాంపూర్‌లో రైతులతో మాట్లాడి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చెరువులు, కాల్వలు పూడికతీత పనులు మానేసి నూతన రోడ్ల నిర్మాణం పనులు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. ఇందుకు ఇరువైపులా ఉన్న రైతులు సహకరించాలని సూచించారు. ఏప్రిల్ 1 నుంచి ప్రతి కూలీ రోజుకు రూ.307 తగ్గకుండా పనిచేయాలని సూచించారు. రూ.300 కన్నా తక్కువ పనిచేస్తే పేమెంట్ చేయడం వీలుకాదని, కూలీలు దృష్టిలో ఉంచుకొని కనీసం ఐదు గంటలు పనిచేయాలని వెల్లడించారు. అలాగే ఫార్మేషన్ రోడ్లు, గుట్ట చుట్టూ కందకాలు, నీటి నిల్వ కందకాలు, ఫిష్ బ్రీడింగ్ పాండ్స్ చేయుటకు పంచాయతీ కార్యదర్శులు రెండు రోజుల్లో తీర్మానాలు చేసి మండల కార్యాలయంలో అందజేయాలని సూచించారు. ఆమె వెంట ఫీల్డ్ అసిస్టెంట్, కూలీలు తదితరులు ఉన్నారు.